సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఉత్సాహంగా ఐక్యతా పరుగు
ప్రొద్దుటూరులో ఆదివారం హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఐక్యతా దినోత్సవం సందర్భంగా రాయల్‌కౌంటీ బైపాస్ వద్ద నిర్వహించారు. -8లో



చట్టాలపై అవగాహన కల్పించాలి
చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.6/24.3

జిల్లాలో ఆదివారం 24.3 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్ఎం
కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ప్రజా రవాణాధికారి కార్యాక్రమాన్ని సోమవారం సాయంత్రం 4 నుంచి 5.00 గంటల వరకు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను 99592 25848 నంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఫుట్‌బాల్ ఎంపికలు
కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 3 గంటలకు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ మహిళల జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు త్వరలో గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, జనన ధృవీకరణపత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు.

మెరిట్ జాబితా విడుదల
కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ జోన్–4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్ సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 29 నుంచి నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాలన్నారు. 2వ తేదీన ఫైనల్ మెరిట్ లిస్ట్, 4న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 7వ తేదీన నియామక కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

ఈ–శ్రమ్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
కడప కోటిరెడ్డిసర్కిల్: అసంఘటితరంగ కార్మికులు ఈ–శ్రమ్‌కార్డు పొందాలని జిల్లా కార్మికశాఖ అధికారి శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ పొందని 16–59 సంవత్సరాల మధ్య వయస్సుగల కార్మికులు ఈ కార్డును పొందేందుకు అర్హులన్నారు. కడపలోని పాత రిమ్స్‌లోగల కార్మికశాఖ కార్యాలయంలో సందేహాల నివృత్తి కోసం 76719 35895, 95818 19573 నంబర్లతో హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్డు కలిగితే వలస కార్మికులు రేషన్ దుకాణంలో బియ్యం పొందొచ్చని, అలాగే ఏదైనా ప్రమాదం జరిగినపుడు ప్రమాద బీమా రూ. 2 లక్షలు వరకు పొందొచ్చన్నారు.

ప్రయాణికుల కోసం స్పెషల్ బస్సులు
కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న జిల్లా వాసులకు ఆర్టీసీ తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసింది. ఆదివారం కడప రీజియన్ నుంచి విజయవాడకు 20 సర్వీసులు, హైదరాబాదుకు 15, బెంగళూరు 20, చెన్నైకు 02 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు సర్వీసులు నడపనున్నట్లు ఆయన వివరించారు. ఈ సర్వీసుల్లో సాధారణ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు.

ఓపెన్‌స్కూల్ పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న అబ్జర్వర్ అక్తర్‌వలి

పోరుమామిళ్ల: ఓపెన్‌స్కూలులో చదివిన విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని ఓపెన్‌స్కూల్ స్టేట్ అబ్జర్వర్ అక్బర్‌వలి అన్నారు.ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్‌స్కూల్ ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని, అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినడం వల్ల పరీక్షల్లో ఉత్తీర్ణులవుతారన్నారు. వివిధ కారణాల వల్ల చదువు మానేసిన విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం ఓపెన్‌స్కూల్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, శివ, ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులు రంతుబాష, సుబ్బారావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మంచి రోజులు

- జిల్లాలో 24 ఫిష్‌ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు
- త్వరలో కడపలో రెండు, ప్రొద్దుటూరులో ఒకటి సూపర్ యూనిట్
- చెరువులు, రిజర్వాయర్లలో త్వరలో 28.40 లక్షల చేప పిల్లల విడుదల



కడపలోని ఫిష్ ఆంధ్ర మినీ రిటైల్ షాపు ద్వారా చేపల అమ్మకాలు(ఫైల్)

కడప అగ్రికల్చర్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. చేపల ఉత్పత్తిని, వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. ఈ కోవలోనే ఫిష్ ఆంధ్ర నినాదంతో రిటైల్ చేపల అమ్మకం కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే 24 ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో అన్ని రకాల చేపలు, రొయ్యలను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు విక్రయిస్తున్నారు.త్వరలో కడపలో రెండు, పొద్దుటూరులో ఒకటి సూపర్ యూనిట్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా చేపలు, రొయ్యలకు సంబంధించి అన్ని రకాల వంటకాలు లభించనున్నాయి.

- జిల్లావ్యాప్తంగా 24 ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్ షాపులు ఉన్నాయి. కడపలో మూడు, పెండ్లిమర్రిలో రెండు, ఒంటిమిట్టలో ఒకటి, సిద్దవటంలో ఒకటి, ఎర్రగుంట్లలో రెండు, కొండాపురంలో నాలుగు, జమ్మలమడుగులో ఒకటి, మైలవరంలో రెండు, గోపవరంలో మూడు, పోరుమామిళ్లలో రెండు, బిమఠంలో ఒకటి, దువ్వూరులో ఒకటి, కాశినాయనలో ఒకటి చొప్పున ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం చేపలు, రొయ్యలతోపాటు ఆర్డర్ మేరకు సముద్రపు చేపల అమ్మకాలను నిర్వహిస్తున్నారు.

చేపల వాడకంతో ఎన్నో ఉపయోగాలు...


చికెన్, మటన్‌తో పోలిస్తే చేపల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా వీటిని తీసుకోవచ్చు. గర్భిణులు, బాలింతలు చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు. రోగ నిరోధక శక్తిన్ని పెంచుకోవడానికి ఉపయోగపడతాయి.

చేపల వినియోగం పెంచేందుకు కృషి


జిల్లాలో చేపల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే జిల్లాలో 24 ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేశాం. త్వరలో కడపలో రెండు, పొద్దుటూరులో ఒకటి సూపర్ యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నాం. మత్స్యకారులకు కూడా 75 శాతం సబ్సిడీపై వలలు, బోట్లను పంపిణీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. – నాగలింగాచార్యులు, డిప్యూటీ డైరెక్టర్, మత్స్యశాఖ

మత్స్యకారులకు ప్రోత్సాహం...


మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం(పీఎంఎంఎస్‌వై) ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. ఇందుకోసం జిల్లాకు రూ. 240 లక్షలు కేటాయించడగా ఇప్పటి వరకు రూ. 52.20 లక్షలు ఖర్చు చేశారు. మిగతా రూ. 189.79 లక్షల నిధులు ఉన్నాయి. వీటితో మత్స్యకారులు చేపల రవాణాకు ఉపయోగించే నాలుగు చక్రాల వాహనాలు, మూడు చక్రాల చేపల అమ్మకపు ఆటోలు రాయితీతో ఇవ్వనున్నారు. జిల్లాలో 29 ఫిషర్‌మెన్ సొసైటీలు, 5 షిషర్ ఉమెన్ సొసైటీలు, ఒకటి జిల్లా ఫిషర్‌మెన్ సొసైటీ ఉన్నాయి. వీటి పరిధిలోని చెరువుల్లో చేపల పెంపకానికి మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో సొసైటీలు 60 శాతం, మత్స్యశాఖ 40 శాతం చేపలను వదుల నుంది. మొత్తంగా 28.40 లక్షల చేపలను సొసైటీల పరిధిలోని 156 చెరువులు, 6 రిజర్వాయర్లలో వదులుతున్నారు.

రాయితీతో బోట్లు, వలలు అందజేత


జిల్లాలో చేపల వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది.వీటికి చేపల సరఫరా కోసం జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని చేపడుతుంది. చేపల వేట చేయుటకు మత్స్యకారులకు 75 శాతం రాయితీతో బోట్లు, వలలు అందించనుంది. పథక యూనిట్ ఖరీదు రూ. 50 వేలుకాగా (బోట్లు, తెప్పకు రూ. 30 వేలు, వలలకు 20) ఇందులో లబ్ధిదారుల వాటా రూ. 12,500 కాగా రాయితీ రూ. 37,500 రానుంది. ఈ పరికరాలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది. ఫిష్ ఆంధ్ర కార్యక్రమానికి జిల్లాలోని పలు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. త్వరలో కడపలో రెండు ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్లు, పొద్దుటూరులో ఒకటి షిఫ్ ఆంధ్ర సూపర్ యూనిట్లును ఏర్పాటు చేయనున్నారు. ఇందులో యూనిట్ ధర రూ. 20 లక్షలు ఉండగా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు.

ఏనుగుల దాడిలో పండ్లతోటలు ధ్వంసం


వైకోట గ్రామంలో అరటి తోటను ధ్వంసం చేసిన ఏనుగులు

ఓబులవారిపల్లె: మండలంలోని అటవీసమీప గ్రామం వైకోట పంటపొలాల్లో ఆదివారం ఏనుగులు దాడి చేశాయి. వైకోట గ్రామానికి చెందిన ఎం జయమ్మకు సంబంధించిన రెండు ఎకరాల అరటితోట, ఎస్ సుబ్బరత్నమ్మకు చెందిన మామిడిచెట్లు, బి దేశయ్యకు చెందిన అరటిచెట్లు ధ్వంసమయ్యాయి. రెండు బోర్లు కూడా నాశనమయ్యాయి.. శేషాచల అటవీ సమీపంలో పండ్లతోటలపై ఏనుగులు వరస దాడులతో బీభత్సవం సృష్టిస్తున్నాయి. దీంతో అటవీ శివారు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.గజరాజుల దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

'స్వయం'తో ఉచిత ఆన్‌లైన్ విద్య
కురబలకోట: మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు విద్యార్థులకు, అధ్యాపకులకు స్వయం పేరుతో ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్), మద్రాస్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు స్వయం పేరుతో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ పరీక్షలకు 5244 మంది నమోదు చేసుకోగా 5009 మంది హాజరైనట్లు తెలిపారు. ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తారన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆన్‌లైన్ సర్టిఫికెట్‌ను ఎన్‌పీటీఈఎల్ అందజేస్తుందన్నారు.

పుష్పగిరిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



పుష్పగిరి క్షేత్ర విశిష్టతను గురించి హైకోర్టు న్యాయమూర్తి దుర్గా ప్రసాద్‌రావుకు వివరిస్తున్న ఆలయ అర్చకులు



పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి దుర్గా ప్రసాద్ రావు దంపతులు

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాద్ రావు సతీమణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు, అధికారుల ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ చెన్న కేశవ స్వామి, శ్రీ లక్ష్మీ దేవి, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకున్నారు. అర్చకులు అర్చనలు, విశేష పూజలను నిర్వహించారు. క్షేత్ర విశిష్టత, చరిత్ర గురించి వారికి వివరించారు. అనంతరం ఆలయం ముందు భాగంలో ప్రవహిస్తున్న పవిత్ర పినాకినీ నదిని సందర్శించారు. ఆలయ కుడ్యాలపై ఉన్న శిల్ప కళను పరిశీలించారు. అర్చకులు, అధికారులు వారిని ఆలయ మండపంలో ఆశీనులను చేసి తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ కుమార్, 4వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి దీనా బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ఎక్సైజ్ జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, అర్చకులు సుమంత్ దీక్షితులు, ఎస్ఐ పెద్ద ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఉప కాలువకు గండి

- శెట్టిపల్లె సమీపంలోని అక్విడక్ట్ అంచున తెగిన కాలువ
- గండి పూడ్చివేత పనులు ముమ్మరం



బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద అక్విడక్ట్ అంచులో పడిన గండి

బి.కొత్తకోట: ఏవీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)కు బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద ఆదివారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో కృష్ణా జలాలు ఆలేరువాగులోకి ఉధృతంగా ప్రవహిస్తూ పీటీఎం మండలంలోని రంగసముద్రం చెరువుకు చేరుతున్నాయి. సమాచారం అందుకున్న ప్రాజెక్టు ఉన్నతాధికారులు గండి పూడ్చివేత కోసం ముమ్మరంగా చర్యలు చేపట్టారు. కాలువకు గండి పడటంతో సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి తరలిస్తున్న కృష్ణా జలాల విడుదలను నిలిపివేశారు.

అక్విడక్ట్ అంచులో..

బి.కొత్తకోటకు సమీపంలోని శెట్టిపల్లె మీదుగా పుంగనూరు ఉపకాలువ కురబలకోట మండలం వైపుకు సాగుతుంది. శెట్టిపల్లె వద్ద వాగు ఉండటంతో వాగు దాటే చోట అక్విడక్ట్ నిర్మించారు. వాగుపై కట్ట ఎత్తును పెంచి కట్టాల్సి ఉన్నందున కింద కాంక్రీట్ పిల్లర్లు, కాంక్రీట్ చానల్ నిర్మించారు. ఈ అక్విడక్ట్ చివరి అంచుల్లో మట్టితో కట్ట నిర్మాణం చేశారు. సాంకేతిక అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించాకే గండి పడడానికి కారణం తెలుస్తుందని ఎస్ఈ రాజగోపాల్ 'సాక్షి'తో అన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ అక్విడక్ట్ అంచున కాలువ తెగింది. ఆ సమయంలో కాలువలో నిండుగా కృష్ణా జలాల ప్రవాహం సాగుతోంది. 60 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఒక్కసారిగా గండిపడటంతో కాలువ నీళ్లు ఆలేరువాగులోకి మళ్లాయి. మొదట మెల్లగా సాగిన ప్రవాహం ఉదయం ఆరు గంటలకల్లా వాగు నిండి పరవళ్లు తొక్కింది. సాధారణంగా కర్ణాటక సరిహద్దుల్లో భారీ వర్షాలు కురిస్తేకాని ఆలేరు వాగు ప్రవహించదు. అలాంటి ఉదయం వాగు ప్రవాహం చూసి స్థానికులు వర్షం లేకనే ఎలా ప్రవహిస్తోందని అనుమానం తలెత్తి, జనం నీళ్లు చూసేందుకు తరలివచ్చారు. వాగులో ప్రవహిస్తున్న నీళ్లన్నీ పీటీఎం మండలం రంగసముద్రం చెరువులోకి చేరుతున్నాయి.

పీటీఎం చెరువుకు మళ్లింపు

కాలువకు గండితో చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి వస్తున్న కృష్ణా జలాలను మళ్లించారు. పీటీఎం సమీపంలోని వ్యాసరాయ చెరువు అనుసంధాన పథకం కాలువ ద్వారా పీటీఎం తిప్పచెరువుకు 50 క్యూసెక్కుల నీటిని మళ్లించారు. మిగతా నీళ్ల ఇక్కడి ఎత్తిపోతల పథకం నుంచి దిగువకు తరలిస్తున్నారు. శెట్టిపల్లె వద్ద కాలువకు గండి పడటంతో చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాల విడుదలను తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా ఎస్ఈ సీఆర్.రాజగోపాల్, జేఈ అంజనేయులు, సిబ్బంది గండి పూడ్చివేత కోసం చర్యలు చేపట్టారు. రెండురోజుల్లో గండిని పూడ్చి కృష్ణాజలాలు యథావిధిగా కుప్పం నియోజకవర్గం వైపునకు తరలించాలని ప్రయత్నిస్తున్నారు.

ఛీ(టీ)డీపీ!

- ప్రజామద్దతు సాధించడంలో విఫలమై కవ్వింపు చర్యలు
- ప్రతిదాడులను ఆశించి వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం
- క్రిమినల్ మనస్థత్వంతో వ్యవహరిస్తున్న తెలుగుతమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాక్షేత్రంలో మరోమారు చేతులెత్తాల్సిన తప్పనిసరి పరిస్థితి. ప్రజలు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏకపక్షంగా మద్దతిస్తున్నారు. కుట్రలు, కుతంత్రాలతో ఆ పార్టీ నేతలపై ప్రజలల్లో వ్యతిరేకత పెంచాలనే లక్ష్యం తెరపైకి వస్తోంది. వరుస కవ్వింపు చర్యలకు దిగుతూ రెచ్చగొట్టి లబ్ధిపొందాలనే దిశగా అడుగులు పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నేత బెనర్జీపై హత్యాయత్నం ఉదంతం అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. సామాజిక సాధికార బస్సు యాత్ర రోజే దాడి చేయడం వెనుక ప్రత్యేక వ్యూహం దాగి ఉన్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయ పార్టీలకతీతంగా అర్హులకు అందుతున్నాయి. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తున్నారు. వర్గాలకు, పార్టీలకతీతంగా పేదలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఎంపిక చేసుకోవాలని ఆశిస్తున్నారు. అధికారంలో ఆయనుంటేనే పేదల్ని గుర్తిస్తారనే భావనలో ఉన్నారు. ఇదే విషయమై వైఎస్సార్‌సీపీ సైతం పేదల దరికి చేరి, వారు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూనే మీకు సాయమంది ఉంటేనే వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపండని అభ్యర్థిస్తున్నారు. 'ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న'అన్నట్లు ప్రజలు వైఎస్సార్‌సీపీకి అపారమద్దతు ప్రకటిస్తున్నారు. ఈవిషయాన్ని గ్రహించిన తెలుగుతమ్ముళ్లు కుట్ర రాజకీయాలను తెరపైకి తెస్తున్నారు.



నడిరోడ్డులో బెనర్జీని కత్తితో నరుకుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరు టార్గెట్‌గా....

ప్రొద్దుటూరులో వైఎస్సార్‌సీపీ అత్యంత శక్తివంతంగా ఉంది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నాయత్వంలో పార్టీ శ్రేణులు బలంగా పనిచేస్తున్నాయి. పైగా అక్కడ సంక్షేమం, అభివృద్ధి పనుల నిమిత్తం దాదాపు రూ.3500 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. వైఎస్సార్‌సీపీని బద్నాం చేయడానికి మార్గం కన్పించక, ఎమ్మెల్యే రాచమల్లు టార్గెట్‌గా వ్యక్తిత్వ హననం దిశగా అడుగులు వేశారు. అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న సోషల్ మీడియా కేంద్రంగా విపరీతమైన ఆరోపణలు చేయసాగారు. తెలుగుదేశం పార్టీ వైఖరి స్పష్టం కావడంతో ఎమ్మెల్యే ఏకంగా టీడీపీ ఆరోపణలపై సీబీఐ నేతృత్వంలో విచారణ చేపట్టాలని స్వయంగా రాతపూర్వకంగా అభ్యర్థించారు. అప్పట్లో మిన్నకుండి పోయిన టీడీపీ శ్రేణులు ఇటీవల క్రికెట్ బెట్టింగ్స్ వ్యవహారం తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్యే పరోక్ష సహకారంతో చేపడుతున్న ఆరోపణల పర్వాన్ని అందుకున్నారు. తెలివిగా వ్యవహరించిన ఎమ్మెల్యే రాచమల్లు ప్రజాప్రతినిధులతో కలిసి స్వయంగా ఎస్పీ సిద్ధార్థకౌశల్‌ని కలిసి క్రికెట్ బెట్టింగ్‌కు కట్టడి చేయాలని అభ్యర్థించారు. టీడీపీ కుటిల ఎత్తులను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తూ వచ్చారు. ఎన్ని ఎత్తులు వేసినా ప్రతికూలంగా మారుతోండడంతో ప్రత్యక్షదాడులకు పాల్పడి రెచ్చగొట్టి భారీ స్థాయిలో అల్లర్లు సృష్టించాలనే వ్యూహం పన్ని సామాజిక సాధికార యాత్ర రోజు అమలు చేసినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



నారా లోకేష్, ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డితో భరత్ కుమార్ రెడ్డి (మధ్యలో వ్యక్తి)

అంగళ్లు ఘటన నేపథ్యంలోనే బీజం...

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నది జగమెరిగిన సత్యం. అక్కడ టీడీపీ పుంజుకోవాలంటే స్థానికంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడి, ప్రతిదాడులు ఉండాలని టీడీపీ ఎత్తుగడ వేసింది. వెరసి ప్రత్యక్షంగా చంద్రబాబు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. ఆమేరకు దాడి, ప్రతిదాడుల ఘటనలు అక్కడ తెరపైకి వచ్చాయి. ఈవ్యవహారం ఆగస్టు 4న చోటుచేసుకుంది. అచ్చం అలాంటి కవ్వింపు చర్యలను ప్రొద్దుటూరులో అవలంభించారు. శనివారం సామాజిక సాధికార యాత్ర సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కానున్నట్లు పసిగట్టారు. అదే రోజు పేద వర్గాలకు చెందిన క్రియాశీలక వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం చేపడితే, ఎమ్మెల్యే రాచమల్లుకు సంబంధం లేకుండానే ప్రతిదాడులకు పాల్పడుతారని అంచనాకు వచ్చారు. ప్రొద్దుటూరు పట్టణం అల్లర్లతో మారుమోగాలని భావించారు. ఆమేరకే తెలుగుయువత అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డిలు వైఎస్సార్‌సీపీకి చెందిన బెనర్జీపై హత్యాయత్నానికి పాల్పడినట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇద్దరు కూడా టీడీపీ ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడం విశేషం.

ఒక దాడి...బహుళ ప్రయోజనాలు.....

బెనర్జీపైనే హత్యాయత్నానికి పాల్పడడం వెనుక వ్యూహం కూడా దాగి ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిఫల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డికి బెనర్జీ సన్నిహితుడు. బెనర్జీని హత్య చేస్తే బంగారురెడ్డి అనుచరులు చెలరేగిపోయి, ప్రతిదాడులు చేస్తారనేది టీడీపీ అసలు లక్ష్యంగా కన్పిస్తోంది. ఇలా ప్రతిదాడులు చెలగేరితే ఎమ్మెల్యేకు ఆ బురద అంటించి, వాణిజ్య వర్గాల నుంచి అపార మద్దతు పొందే అవకాశం ఉంది. అలాగే ఈ వ్యవహారంతో వైఎస్సార్‌సీపీని దీటుగా ఎదుర్కొనే శక్తి తనకే ఉందని టీడీపీలో చెప్పకనే ప్రకటించుకోవడం, ఎమ్మెల్యే టికెట్‌కు అడ్డుగా ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడుల కంటే పైచేయి సాధించడం.. ఇలా బహుళ ప్రయోజనాలు ఆశించిన తర్వాతే వ్యూహాన్ని హత్యాయత్నం అమలు చేసినట్లు విశ్లేషకులు వెల్లడిస్తుండడం గమనార్హం.

ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో సహా మరో ఇద్దరిపై కేసు
ప్రొద్దుటూరులోని గాంధీరోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీపై జరిగిన దాడి సంఘటనలో భరత్‌కుమార్‌రెడ్డి, రాము అలియాస్ రామ్మోహన్‌రెడ్డితో పాటు కుట్రలో భాగస్వామి అయిన ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఇన్‌చార్జి డీఎస్పీ నాగరాజు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అనుచరుడైన భరత్‌కుమార్‌రెడ్డి పాత కక్షలను మనసులో పెట్టుకొని బెనర్జీని కత్తితో విచక్షణా రహితంగా నరికాడన్నారు. తీవ్ర గాయాలైన అతన్ని చికిత్స నిమిత్తం కేవీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం బెనర్జీ ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ప్రత్యక్ష సాక్షి వెంకటరామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కుట్ర, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ నాగరాజు చెప్పారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న ఓ కల్యాణ మండపంలో ఆదివారం జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాషా తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.53 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : మండల పరిధి పార్నపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.15,600 నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

34 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితురాలితో ఎస్ఐ, ఏఎస్ఐ

పోరుమామిళ్ల : మండలంలోని ఇందిరానగర్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న చిక్కొండు కొండమ్మను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం వున్నట్లు ఆర్ ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. అతని ఆచూకీ తెలిసిన వారు తమను నేరుగా సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం



మృతి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగాదేవి

చెన్నూరు : మండల పరిధి కడప – రాజంపేట బైపాస్‌లోని డీఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్ల టౌన్‌లోని వేంపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న శనివారపు భాస్కర్‌రెడ్డి(53), ఆయన భార్య గంగాదేవి(47) పని నిమిత్తం బైక్‌పై కడపకు వెళ్లారు. తిరిగి ఎర్రగుంట్లకు వెళ్తుండగా.. అలంఖాన్‌పల్లి బైపాస్ నుంచి రాజంపేట వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కర్ రెడ్డి, ఆయన భార్య గంగాదేవి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా 'ఐక్యతా పరుగు'

- ప్రొద్దుటూరులో హాఫ్ మారథాన్–2023
- జాతీయ ఐక్యతాదినోత్సవం సందర్భంగా నిర్వహణ
- పాల్గొన్న దేశంలోని పలు ప్రాంతాల, కెన్యా క్రీడాకారులు
- పరుగు పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ



పరుగు పోటీలు ప్రారంభిస్తున్న ఐఆర్ఎస్ రామనాథరెడ్డి



విజేతలతో నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరులో ఆదివారం హాఫ్ మారథాన్–2023 ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. జాతీయ ఐక్యతా దినోత్సవం (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) సందర్భంగా రాయల్‌కొంటీ బైపాస్ వద్ద సేవాంష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరుగు పోటీలలో 2800 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కేరళ ప్రాంతాల క్రీడాకారులతో పాటు కెన్యా దేశానికి చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఆర్ఎస్ అధికారి, మారథాన్ నిర్వాహక కమిటీ చైర్మన్ ఉండేల రామనాథరెడ్డి మాట్లాడుతూ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో హాఫ్ మారథాన్ పరుగు పోటీలు నిర్వహించామన్నారు. ప్రొద్దుటూరు ఖ్యాతిని ఇనుమడింప చేసేలా దేశంలోని పలు ప్రాంతాల క్రీడాకారులతో పాటు కెన్యాకు చెందిన అథ్లెట్లు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. పెద్ద పెద్ద పట్టణాల్లో మాత్రమే నిర్వహించే హాఫ్ మారథాన్.. ప్రొద్దుటూరు పట్టణంలో రెండో సారి విజయవంతంగా జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు,

పోటీతత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు, ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధను పెంచేందుకు మారథాన్ జరిపామన్నారు. తల్లిదండ్రులు, పలు పాఠశాల యాజమాన్యాలు తమ పిల్లలను ఉత్సాహంగా ఈ మారథాన్‌కు తీసుకురావడం అభినందనీయమన్నారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ టీ షర్ట్స్ అందించి నిర్ణీత దూరాన్ని పూర్తి చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్‌లను అందించారు. విజేతలకు రామనాథరెడ్డి, ఆయన సతీమణి యోగిత నగదు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, ఎస్ఆర్ఐటీ కళాశాల వైస్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, డాక్టర్ కల్లూరు ప్రసాదరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలతోపాటు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ పోటీలను సేవాంష్ ట్రస్ట్ అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ, కోశాధికారి వద్ది మురళి, వ్యాయామ ఉపాధ్యాయులు నడిగడ్డ సుధాకర్, కోనేటి సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, అహమర్ బాషా, జిల్లా అథ్లెటిక్ సంఘంతోపాటు పలు కళాశాలల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు పర్యవేక్షించారు. పాల్గొన్న క్రీడాకారుకు ఉచిత, వసతి, అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విజేతలు వీరే

5 కిలో మీటర్ల పరుగు పోటీల్లో మహిళల విభాగంలో ప్రథమ స్థానం పూజిత(ఏలూరు) రూ.7000, ద్వితీయ స్థానం సాయిప్రియ రూ.5000, తృతీయ స్థానం శాలిని రూ.3000 (కర్నూలు), పురుషుల విభాగంలో ప్రథమస్థానం దినకర్ రూ.7000(కర్నూలు), ద్వితీయస్థానం విజయేంద్ర కుమార్ రూ.5000 (ఛత్తీస్‌ఘడ్), తృతీయస్థానం సత్య రూ.3000 (వైజాగ్) సాధించారు. 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో మహిళల విభాగంలో ప్రథమ స్థానం నిషా రూ.12,000 (ఉత్తరప్రదేశ్), ద్వితీయ స్థానంలో పూజా పటేల్ రూ.10,000 (ఉత్తరప్రదేశ్), తృతీయ స్థానంలో మేరీ గ్రేస్ రూ.8000 (విశాఖ), పురుషుల విభాగంలో ప్రథమ స్థానం ఎల్‌కరోలోన రూ.12000 (కెన్యా), ద్వితీయ స్థానంలో హరీష్ రూ.10,000 (విజయనగరం), తృతీయ బహుమతి శివకుమార్ రూ.8000 (కడప) నిలిచారు. మహిళల 21 కిలోమీటర్ల పరుగులో ప్రథమ స్థానం లీలన్ రూ.21,000 (కెన్యా), ద్వితీయ స్థానంలో డిపి.ఆశ రూ.16, 000(కేరళ), తృతీయ స్థానంలో మహేశ్వరి రూ.10, 000 (తెలంగాణ), ప్రోత్సాహక బహుమతి యామిని రూ.7000(శ్రీకాకుళం), గౌతమిభాయ్ రూ.5000 (అనంతపురం), పురుషుల విభాగం ప్రథమ స్థానంలో ఇసాక్ కొయిచ రూ.21,000 (కెన్యా), ద్వితీయ స్థానంలో రమేష్ రూ.16,000 (తెలంగాణ), తృతీయ స్థానం సైమన్ రూ.10,000 (కెన్యా), ప్రోత్సాహక బహుమతి సాయి కిరణ్‌సాహల్ రూ.7000(ఒడిశా), విశాల్ రూ.5000 (కర్ణాటక) పొందారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చట్టాలపై అవగాహన కల్పించాలి

అట్లూరు : చట్టాలపై ప్రజలకు ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ అండ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు అవగాహన కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని సిద్దవటంరోడ్డులో ఆ సంస్థ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి ఈ ఫోరం ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు సహాయపడుతుందన్నారు. తమ హక్కులను ఎక్కడైనా కోల్పోయినప్పుడు వారికి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరమణ, పంచాయతీ సెక్రటరీ ఆనందరావు, ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ అండ్ హ్యూమన్ రైట్స్ స్టేట్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రెసిడెంట్ కె.ప్రవీణ్‌కుమార్, లీగల అడ్వకేట్ కొడవలి కంటిబాబు, పసుపులబాలు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జి.రవిచంద్ర, స్టేట్ యూత్ వైస్‌ప్రెసిడెంట్ ఎన్.చిరంజీవి, స్టేట్ రెవెన్యూ కమిటీ ప్రెసిడెంట్ జి.ప్రతాప్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెయిన్ బాడీ మెంబర్స్ కె.రాజు, జి.మహేష్, సత్తార్, చిన్న, ఎస్.అఖిల్, బండిజకరయ్య, తుమ్మలపల్లె బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



'కన్జ్యూమర్ ఫోరం' కార్యాలయం ప్రారంభిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

కొత్త బంగారులోకం..!

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పీజీలో ప్రవేశం.. అందునా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో సీటు.. ఏపీ పీజీసెట్–2023 విజేతలుగా నిలిచి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడుగిడిన క్షణాలివి.. ఈ తరుణంలో కొత్త బంగారు లోకానికి స్వాగతం పలుకుతోంది యోగివేమన విశ్వవిద్యాలయం.

- వైవీయూలో తరగతుల ప్రారంభం
- క్యాంపస్‌లో విద్యాభ్యాసన అరుదైన అవకాశం



వైవీయూ ప్రధాన ద్వారం

వైవీయూ : పోస్టుగ్రాడ్యుయేషన్‌లో ప్రవేశమంటే భవిష్యత్తుపై ఒక అవగాహన ఏర్పరచుకున్న దశ. అభ్యసనతోపాటు అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన తరుణం. విశ్వవిద్యాలయం అంటే కేవలం పీజీ కోర్సుకు సంబంధించిన పట్టా ఇవ్వడం వరకు మాత్రమే కాదు.. భవిష్యత్ జీవితాన్ని మలిచే విద్యాలయం. రెండేళ్ల పాటు విద్యార్థి జీవనానికి అవసరమైన పునాదిని వేస్తుంది. పరిశోధన రంగంలో నిపుణులుగా తయారు చేసి సమాజానికి అందిస్తుంది. దీనికి విద్యార్థి సంసిద్ధుడుగా ఉంటూ ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో అవసరం. విజయదశమి సెలవులకు ముందు వైవీయూలో తరగతులు ప్రారంభం అయ్యాయి. అప్పుడు కొంత మంది మాత్రమే హాజరయ్యారు. సెలవుల తర్వాత యూనివర్సిటీ పునఃప్రారంభం అయింది. ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రత్యక్ష పరిజ్ఞానం అవసరం

విశ్వవిద్యాలయంలో తరగతులతోపాటు ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేస్తారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేవి ప్రయోగశాలలే. తరగతిలో నేర్చుకున్న అంశాలకు ఆచరణ వేదికలివి. విద్యార్థి నిత్యం ప్రయోగశాలలో వీలైనంత సమయం గడుపుతూ ప్రత్యక్ష పరిజ్ఞానం పొందే యత్నం చేయాలి. తర్వాత తాను నేర్చుకున్న అంశాలను జీవితాంతం మనసులో పదిలపరుచుకునే అవకాశం లభిస్తుంది. భవిష్యత్తులో పరిశోధకులుగా రాణించాలంటే అవసరమైన పునాది పడేందుకు వేదికలు ప్రయోగశాలలే.

ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయం

విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం విద్యార్థులకు స్వాగతం పలుకుతుంది. ఇందులో దాదాపు 50 వేలకు పైగా పుస్తకాలు, జర్నల్స్ ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో బోధన నూతనంగా ఉంటుంది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఒక అంశంపై భిన్న కోణాల్లో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంటుంది. పాఠ్యపుస్తకం కంటే పరిశీలన జరపాల్సిన గ్రంథాలే అధికం. ఒక శాస్త్రీయ అంశాన్ని వేర్వేరు కోణాల్లో శాస్త్రవేత్తలు, రచయితలు అందించే విధానం విద్యార్థిలో నూతన ఆలోచనలను రేకెత్తిస్తుంది. తద్వారా లోతైన అధ్యయనం చేయాలన్న ఆసక్తి విద్యార్థుల్లో కలుగుతుంది. వీటితో పాటు విద్యార్థులకు పరిచయమయ్యేవి వారు ఎంచుకున్న విభాగం, క్యాంటీన్, ఆర్ట్ గ్యాలరీ, అందమైన భవన సముదాయం, ఆహ్లాదకరమైన వాతావరణం.

అధ్యాపకులే మార్గదర్శకులు

పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ స్థాయిలో అధ్యాపకులు మన ప్రగతిపై ఎంతో శ్రద్ధ వహించడం జరుగుతుంది. ఒక విధంగా మనల్ని నిత్యం చదివించి అభివృద్ధికి పని చేసే విధంగా విద్యావ్యవస్థ ఉంటుంది. విశ్వవిద్యాలయంలో పూర్తి స్వేచ్ఛతో కూడిన వాతావరణం దర్శనమిస్తుంది. ఇక్కడ విద్యార్థి స్వీయఅనుభవాలు, కృత్యాల నుంచి నేర్చుకోవాల్సిందే అధికంగా ఉంటుంది. విద్యార్థి వర్సిటీలో తనకు నచ్చిన సామర్థ్యాలకు తగిన కోర్సులను ఎంపిక చేసుకుంటారు. వర్సిటీలో చేరిన తర్వాత ఆచార్యుల మార్గదర్శనం ఎంతో అవసరం. వారి అడుగజాడల్లో నడుస్తూ తమ భవితకు బాటలు వేసుకోవాల్సిన అవసరం ఉంది. నిత్యం ఆచార్యులకు అందుబాటులో ఉంటూ వారి నుంచి వీలైనంత జ్ఞానాన్ని పొందే ప్రయత్నం విద్యార్థి చేయాలి. పీజీ చేసిన తర్వాత అవకాశాలపై వీరి మార్గదర్శకం ఎంతో ప్రభావం చూపుతుంది.

వసతుల సద్వినియోగం

విద్యార్థులకు ఉపయుక్తంగా క్రీడామైదానం, వ్యాయామశాల, డిస్పెన్సరీ, పోస్టాఫీసు, బ్యాంకు, బొటానికల్ గార్డెన్ క్యాంటీన్ సౌకర్యం వంటివి అందుబాటులో ఉంటాయి. గ్రంథాలయం పక్కనే విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా రీడింగ్‌రూం ఎల్లవేళలా స్వాగతం పలుకుతుంది. విద్యార్థులకు అవసరమైన సమాచారం పొందేందుకు కంప్యూటర్ సెంటర్‌తోపాటు విశ్వవిద్యాలయంలో వైఫై కనెక్షన్ ఉండటం మరో అదనపు అంశం. విద్యార్థి రెండేళ్ల కాలాన్ని అధికంగా ప్రయోగశాల, గ్రంథాలయల్లో గడపడానికి ఆసక్తి చూపాలి. తద్వారా పుస్తక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందే అవకాశం కలుగుతుందన్నది నిపుణుల మాట.

సాధికార యాత్ర విజయవంతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు 25 వేల మంది జనం హాజరై విజయవంతం చేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సాధికార కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాట పడుతోందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారిగా బస్సు యాత్రను చేపట్టారన్నారు. ప్రజల నుంచి ఈ సభలకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన సభకు అన్ని సామాజిక వర్గాల వారు, కుల సంఘాల పెద్దలు హాజరయ్యారన్నారు. సాధారణంగా సభలో సినీ గ్లామర్ లేకపోయినా సీఎం జగన్ ఆదేశాల మేరకు పంపిన ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. జగన్ లక్ష్యాన్ని, సంకల్పాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమానికి తమ మద్దతు అవసరమని ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం సభ నిర్వహణకు చక్కటి ఏర్పాట్లు చేసిందని, ట్రాఫిక్‌ను మళ్లించి ప్రజలకు ఇబ్బందులు తొలగించిందన్నారు. పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, కౌన్సిలర్లు జయంతి, లావణ్య, సత్యం పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ప్రొద్దుటూరులో దళిత యువకుడైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీపై టీడీపీ తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు భరత్ కుమార్‌రెడ్డి శనివారం వేటకొడవలితో దాడి చేసిన విషయం తెలిసిందే. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెనర్జీని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రాదరెడ్డి ఆదివారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్‌తో చర్చించారు. అనంతరం ఆర్అర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర జరుగుతుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. ప్రజలందరూ చూస్తుండగానే వాటర్ ప్లాంట్ రామ్మోహన్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి బుల్లెట్‌పై రావడం, భరత్ కుమార్‌రెడ్డి అక్కడే టెంకాయల అంగడి వద్ద ఉన్న కొడవలితో బెనర్జీని నరకడం జరిగిందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. అట్టడుగు వర్గాలకు సామాజిక సాధికారత కల్పించాలని తాము ప్రయత్నిస్తుంటే, వారిని కాళ్ల కింద చెప్పుల వలే ఉండాలని టీడీపీ నేతలు కోరుకుంటున్నారన్నారు. చావు బతుకుల మధ్య ఉన్న కార్యకర్తను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కేసులో ప్రవీణ్‌తో పాటు భరత్ కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్ రెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ప్రొద్దుటూరు, రాజుపాళెం వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ బడి.. ప్రకృతి ఒడి

- చుట్టూ పచ్చని చెట్లు
- ఆహ్లాదకర వాతావరణం
- ఆనందంగా చదువుకుంటున్న విద్యార్థులు



చెట్ల మధ్యన తుంగావారిపల్లె ప్రభుత్వ స్కూల్

కురబలకోట(అన్నమయ్య జిల్లా) : ఏపుగా పెరిగిన చెట్లు.. ఆపై ఎప్పుడూ చల్లగా ఉండే వాతావరణం. ఆహ్లాదంగా పరిసరాలు. అక్కడ ఉంటే ప్రకృతి ఒడిలో ఉన్నట్లే ఉంటుంది. మండు వేసవిలో కూడా చల్లగా ఉంటుంది. ఇలాంటి బడి అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం అంగళ్లు దగ్గర తుంగావారిపల్లెలో ఉంది. ఇక్కడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ ఐదేళ్ల క్రితం సరవ మొక్కలు నాటారు. అవి పెరిగి పెద్దవై నీడతో పాటు చల్లని గాలిని ఇస్తున్నాయి. విద్యార్థులు కూడా పాఠశాల భవనంలో కన్నా చెట్ల కింద హాయిగా చదువులు సాగిస్తున్నారు. చుట్టూ బయో ఫెన్సింగ్‌లా ఉంటున్నాయి. వీటిని అటవీ శాఖ నాటించింది. రూ.లక్షకు పైగా వ్యయంతో అప్పట్లో స్కూల్ ప్రాంగణం చుట్టూ 2500 మొక్కలు నాటారు. 600కు పైగా ఏపుగా పెరిగిన చెట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. తుంగావారిపల్లెకు చెందిన తళవం రమణ అటవీ శాఖ ఆధ్వర్యంలో వీటిని నాటి పెంచి పెద్ద చేశారు. ఇతనికి అటవీ శాఖ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆనాటి టీడీపీ ప్రభుత్వంలో అటవీ శాఖ అధికారులు ఇతని కష్టాన్ని మొత్తం తినేశారు. ఉన్న ఊరి బడి అన్న కారణంగా మొక్కలు నాటి నీళ్లు పోసి పెంచి పెద్ద చేశారు. రమణ కృషితో అవి ఇప్పుడు ఆ ఊరి బడికి కొత్త అందాన్ని ఇస్తున్నాయి. టీచర్లు, విద్యార్థులకు చల్లని నీడను ఇస్తున్నాయి. చల్లని బడిగా పేరు తెచ్చుకుంది. ఇక్కడ ఎప్పుడూ నీడ ఉండటంతో మధ్యాహ్న భోజనానికి కూడా వంట గది అవసరం లేకుండా పోయింది. పచ్చని చెట్ల మధ్య విద్యార్థులు అటు చదువులు ఇటు ఆటలు సాగిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో విద్యార్థులు ఆరోగ్యకరంగా కూడా ఉంటున్నారు.

ఎప్పుడూ చల్లగా ఉంటుంది



ఇక్కడ 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఏకాలంలోనైనా ఇక్కడ చల్లగా ఉంటుంది. విద్యార్థులు కూడా స్కూల్ భవనంలో కన్నా ఈ చెట్ల కింద చదువుకోడానికి ఇష్టపడతారు. చుట్టూ చెట్లు ఉండడంతో వేసవిలో కూడా ఎండ పడదు. చల్లటి గాలితో హాయిగా ఉంటుంది. వర్షానికి ఈదురు గాలులకు ఈ చెట్లు తట్టుకుంటాయి. విద్యా శాఖ అధికారులు కూడా ఇక్కడికి వస్తే అంత తొందరగా వెళ్లరు. అంత హాయిగా ఉంటుంది. ఇలాంటి స్కూల్‌లో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

–ఎస్‌కె గౌరి, హెడ్మాస్టర్, తుంగావారిపల్లె, కురబలకోట మండలం

చోరీపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకులవీధిలో వున్న ఓ మెడికల్ స్టోర్‌లో ఈనె 13న చోరీ జరిగింది. ఈ చోరీలో దాదాపు రూ.40 వేలను గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి తీసుకుని వెళ్లినట్లు బాధితుడు అజయ్ బాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

12 మేకలు సజీవ దహనం



అగ్ని ప్రమాదంలో చనిపోయిన మేకలు

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ పరిధి ఇందిరానగర్‌లోని చెవుల జయమ్మకు చెందిన 12 మేకలు సజీవ దహనమయ్యాయి. మేకలు కాచుకుంటూ జీవనం సాగించే ఆమె.. యథావిధిగా శనివారం రాత్రి తన ఇంటికి ఎదురుగా ఉన్న కొట్టంలో వాటిని కట్టేసింది. అర్ధరాత్రి సమయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా కొట్టం కాలిపోయి 12 మేకలు సజీవ దహనమయ్యాయి. మొత్తం 30 మేకలు ఉండగా మంటలను ఆర్పి మిగతా వాటిని రక్షించుకున్నారు. సంఘటన స్థలాన్ని వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి పరిశీలించారు. సంఘటన ఎలా జరిగిందని జయమ్మను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ తనకు మేకలే జీవనాధారమని, నిత్యం వాటిని పోషించి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. ప్రస్తుతం 12 మేకలు చనిపోవడంతో దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా మేకలు కూడా దెబ్బతినడంతో మార్కెట్‌లో తక్కువ రేటుకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు.